# దేవుడు

గదిలో లైటు వెలుగుతోంది.

బెడ్ మీద పడుకున్న ప్రభాకరం ఏదో రిఫరెన్సు కోసం పుస్తకం తిరగేస్తున్నాడు.

యాష్ ట్రేమీద సిగరెట్ కాలిపోతోంది.

పడుకున్న వాడల్లా లేచి పుస్తకం, ప్రక్కనేవున్న టేబిల్ మీద వుంచి ట్రేమీది సిగరెట్ చేతిలోకి తీసుకున్నాడు!

ప్రభాకరం కళ్ళముందు గోపీ మెదిలాడు.

ఓ చిరునవ్వు నవ్వి బరువుగ శ్వాస వదిలాడు.

హాస్పటల్ నుంచి ఇంటికి రాబోయేముందు గోపీని పరామర్శించి వచ్చిన సంఘటన కళ్ళముందు మెదిలింది.

"వంట్లో మెలావుంది గోపీ?"

"కులాసాగానే వుంది సార్!" గోపి పడుకున్నవాడల్లా లేచి కూర్చుని చేతులు జోడించి వినయంగా జవాబిచ్చాడు.

"ఆల్ రైట్!...నే వస్తా?" బుగ్గమీద చిటికవేసి మరో బెడ్ వేపు కదలబోయాడు ప్రభాకరం.

"సార్ రేపు...నాకు ఆపరేషన్ చేస్తారుకదూ..." అంటూ దీనంగా ప్రభాకరం కళ్ళల్లోకి చూసేడు గోపి.

"అవును మరేం భయంలేదు" వీపు తట్టేడు.

"మరి...ఆపరేషన్ చేస్తే చచ్చిపోతానా డాక్టరు గారూ..." గోపీ కంటిలో నీరు నిల్చింది.

"ఛ!–అనెవరన్నారు?–"

"మా తాతయ్య కథల్లా చెప్తూండేవాడు–" అమాయకంగా అన్నాడు.

"మీ తాతయ్య చెప్పినవన్నీ కథలే! ఆపరేషన్‌చేస్తే మెవ్వరూ చచ్చిపోరు."

"ఒకవేళ...నేను చచ్చిపోతే మెట్లా సార్. మళ్ళీ బ్రతకనుగా!...ఆడుకోలేనుగా ... స్కూలుకు వెళ్ళేందుకు వీల్లేదుగా సార్..." భోరు మన్నాడు గోపి.

పసి హృదయానికూడా చావంటే ఎంత భయం అన్పించింది ప్రభాకరానికి. బ్రతకాలనే తృష్ణ గోపి కళ్ళల్లో చూచేసరికి ప్రభాకరం హృదయం ద్రవించిపోయింది.

క్షణంపాటు స్తబ్ధుగా వుండిపోయిన ప్రభాకరం "అవేం మాటలు గోపీ, నీ కేం భయంలేదు. బెంగపెట్టుకోకు!!-" ఓదార్చేడు.

"చచ్చిపోతే దేవుడుగాని బ్రతికించలేడని మా తాతయ్య చెప్పాడు..."

అదోలా నవ్వి, "అవును, నేను దేవుడునేగా! రోగు లందరికీ నేను దేవుడినే!-నీ కేం భయంలేదు. చక్కగా పడుకుని నిద్రపో..." ముందుకు సాగిపోయాడు ప్రభాకరం.

పూర్తిగా కాలిపోయిన సిగరెట్ 'ట్రే' లోకి నెట్టి మరో సిగరెట్ వెలిగించాడు.

పదేళ్ళయినా పూర్తిగా నిండని గోపీకి ప్రాణమంటే యింత తీపి అన్పించింది. చచ్చిపోతాడనే భయం...మళ్ళీ బ్రతకనేమోనే బెంగ గోపీ కంటిలో నీటిద్వారా అతని కంఠంలో ధ్వనించినప్పుడు ప్రభాకరం హృదయం ద్రవించి పోయింది...బ్రతకాలంటే గోపీ తాపత్రయం చూస్తుంటే యెలాగైనా గోపీని బ్రతికించాలనే పట్టుదల, దీక్ష ప్రభాకరంలో యెక్కువవుతున్నాయి—

గోపీలో ప్రాణం తీసేంతటి జబ్బేమీ లేదని తెలుసు. అయితే చచ్చిపోతాననే భయం మాత్రం పసిహృదయంలో సాలెగూడులా అల్లుకుపోయింది. అందుకే మందులు వాడటంకన్నా, గోపీలో మానసిక దౌర్బల్యాన్ని దూరం చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు ప్రభాకరం.

నిజానికి ప్రభాకరం దేవుడుకాదు. ఆ విషయం అత

నికీ తెలుసు. తెలుసు కానీ...గోపీ భయం చూస్తుంటే తను దేవుడిలా నటించాల్సి వచ్చింది. తద్వారా గోపీలో మరింత ధైర్యం కల్గించగల నన్పించింది. గోపీ భవిష్యత్తుకు తని ప్పుడు దేవుడు-'డాక్టరుగారూ...నేనూ చచ్చిపోతానా!' అని గోపీ దీనాతిదీనంగా తన కళ్ళల్లో చూచినప్పుడు నిజమైన దేవుడిలాగ ఆ పసిహృదయానికి అభయహస్త మిచ్చి సమాధానపర్చ గలిగేడు.

గోపీ బ్రతికితే తను దేవుడు. లేకపోతే...

ప్రభాకరం చిల్డ్రిన్ స్పెషలిస్టు.

చిన్నపిల్లలంటే చెప్పలేని అభిమానం అంతకుమించిన ప్రేమ - తన చిన్నతనం బాగా గుర్తుంది ప్రభాకరానికి. అంచేతనే పసిహృదయాలను, వారి అనారోగ్యాలను గురించి 'రిసెర్చి' కోసం ఫారిన్ కూడా వెళ్ళొచ్చాడు.

తన పదోయేట ఆస్పత్రిలో ఆపరేషన్ కోసం చేరటం ప్రభాకరానికి బాగా గుర్తుంది - వార్డులో మొత్తం పాతిక బెడ్లకు పైగా వున్నయి. రకరకాల వ్యాధులతో, బాధలతో అవస్తపడుతున్న తోటి పిల్లలను వార్డులో బెడ్లమీద చూచే సరికి భయం ప్రారంభమైంది ప్రభాకరంలో. వాళ్ళంతా తన కేసి వింతగా చూడటం, రోగాలతో దీనాతిదీనంగా అవస్థ పడటం కళ్ళపడేసరికి ప్రభాకరం గుండె నీరయింది - 'ఆపరేషన్‌కోసం వచ్చావుగదూ...అయితే బ్రతకవులే...తప్పకుండా చచ్చిపోతావు' అనే భావనతో మూగ భాషతో తోటి పేషెంట్లంతా తనకేసి చూస్తూంటే గుండె మరింత

బేజారయింది-ఆపరేషన్ చేయించుకుంటే చనిపోవలసిందేనని బాధపడ్డాడు! కన్నీరు కార్చాడు!! కానీ...తన పరిస్థితికంటే ప్రక్క బెడ్డుమీద పడుకున్న సాటివారిమీద సానుభూతి యెక్కువవుతోంది.

ఆపరేషన్ అయ్యాక ప్రభాకరం బ్రతికేడు. పదేళ్ళ ప్రభాకరంలో తనొక డాక్టరవ్వాలనీ...అందులోనూ 'ఛిల్డ్రెన్ స్పెషలిస్టు' అయి పిల్లలందరినీ బ్రతికించాలనీ ఏ ఒక్కరినీ చావనీయకూడదనే బలీయమైన కోరిక అంకురించింది. అదే కోరిక భవిష్యత్‌ను సిద్ధాంతీకరించింది.

ప్రభాకరం గత మూడేళ్ళ ప్రాక్టీసులో ఒక్క కేసు కూడా ఫేలవలేదు.

భోజనం, నిద్రవేళలు తప్ప, మిగతా టైంలో డ్యూటీ చేయటం, రిఫరెన్సులకోసం పుస్తకాలు చదవటం తప్ప మరో పనిచెయ్యడు - వ్యాధిగ్రస్తులై మంచానవున్న పిల్లలతో సరదాగా కబుర్లాడతాడు. వారిలో ధైర్యాన్ని ప్రేరేపించే భవిష్యత్ పట్ల ఆశచూపిస్తాడు, నవ్విస్తాడు—

దరిలో వెలుగుతున్న లైటు ఆర్పి నిద్రకు ఉపక్రమించాడు ప్రభాకరం.

తలుపు తట్టిన శబ్దం విన్పించింది.

లేచి వెళ్ళి తలుపు తీశాడు.

'నమస్కారం డాక్టరుగారూ...' గుమ్మంలోనుంచీ ఓ స్త్రీ కంఠం విన్పించింది.

"లోపలికి రండి..." అనేసి వెనక్కు వచ్చి గదిలో పెద్దలైటు వేశాడు.

కుర్చీలో కూర్చున్న ప్రభాకరం కాళ్ళ దగ్గరగా ఆమె కూర్చుని 'మా గోపీ విషయమే మరోసారి మనవి చేద్దామని వచ్చాను డాక్టరుబాబూ!! లేక లేక కలిగిన బిడ్డ. పుట్టినప్పటినుంచీ వాడి కొచ్చిన రోగాలతో బ్రతికి బట్టకడ తాడని అనుకోలేదు. మళ్ళీ యింతలోనే ఈ అవాంతరం ఒకటొచ్చింది' అంది కళ్ళొత్తుకుంటూ.

'చూడమ్మా! మీరు అంతగా, కంగారు పడవలసిం దేంలేదు' అన్నాడేగాని బిడ్డ భవిష్యత్ కోసం తల్లడిల్లుతున్న మాతృ హృదయాన్ని, ఆ వేదనను ఒదార్చలేకపోయాడు.

"డాక్టరుబాబూ! అసలే తండ్రిలేని పిల్లవాడు. నా గోపీని నాకు తిరిగి వప్పగించండి. మీ మేలు మర్చిపోను... భగవంతుడు మిమ్మల్నీ...మీ పిల్లల్నీ చల్లగా కాపాడ తాడు" అని ఏదో చెప్పబోయి బొడ్లోనుంచి డబ్బుతీసి ప్రభా కరం కాళ్ళముందు వుంచింది.

"ఏమిటమ్మా యిది? నాకు డబ్బు అవసరంలేదు. గోపీకేం భయంలేదు. మీ రనవసరంగా ఆందోళన పడకండి. శాయశక్తులా నా ప్రయత్నం నేను చేస్తాను."

"మీ కెంతిచ్చినా ఋణం చాలదు బాబూ!...బీద దాన్ని, ఇది వుంచండి..."

"చూడమ్మా! నే నొక మాట చెప్తాను. నామీదున్న విశ్వాసంకంటే...నా మాట విలువకంటే...నేను ఈ డబ్బు తీసుకుంటే నీకు తృప్తిగా వుంటుందనుకుంటే... నే నేం చెప్ప

లేను. అంచేత ఆ డబ్బు మీ దగ్గరేవుంచి గోపీ కేదైనా బల మైన ఆహారమివ్వండి."

"క్షమించండి బాబూ! నా ఆదుర్దాకొద్దీ...మిమ్మల్ని ఈ విధంగానైనా తృప్తిపర్చగల ననుకున్నాను...ఇక గోపీ మీ బిడ్డేననుకోండి..." అనేసి వెళ్ళిపోయిందామె.

బరువుగా శ్వాసవిడిచిన ప్రభాకరం లేచి వెళ్ళి తలుపు గడియ వేసొచ్చి బెడ్‌మీద పడుకున్నాడు.

కళ్ళు మూసుకున్నా, గోపీ మనసులో మెదులు తున్నాడు - గోపీ నెలాగైనా బ్రతికించాలి. లేకపోతే గోపీ తల్లి నన్ను శపిస్తుంది. గోపీని బ్రతికించ గలిగితే అతనూ ఓ పెద్ద డాక్టరు అవుతాడేమో!...అంతకంటే ఖరీదైన మనిషి అవుతాడేమో అన్పించింది.

ఆలోచనా పరంపరలమధ్య ప్రభాకరం మస్తిష్కం, నలిగిపోతున్నప్పటికీ, గట్టిగా కళ్ళు రెండూ మూసుకుని నిద్రలోకి జారబడ్డాడు.

*　　*　　*

మళ్ళీ తలుపు తట్టిన శబ్దమయింది.

తలుపు తీశాడు.

"టెలిగ్రాం సార్!" పోస్టు మెసెంజరు గొంతు విన్పించింది.

సంతకంచేసి కంగారుగా కవరు చేతిలోకి తీసుకున్నాడు.

'శారద సీరియస్. స్టార్టు ఇమీడియట్లీ' అనే మాటలు చదివేసరికి ఓ క్షణంపాటు స్తంభించిపోయాడు.

కాళ్ళకింద భూమి బ్రద్దలైన ట్లనిపించింది.

ఉన్నట్టుండి శారద కేమైనట్టు? కులాసాగే వున్నట్టు ఉదయాన్నే కదా లెటరొచ్చింది!

ఒక్క క్షణం కూడా గదిలో వుండాలనిపించలేదు. శ్రీమతి ఆరోగ్యంపట్ల ఆందోళన పడసాగేడు.

వెంటనే టెలిఫోన్ దగ్గరకెళ్ళి ఓ నంబర్ డయల్ చేశాడు!

"హలో...ఎవరు మాట్లాడేది - ఆఁ...నేను. డాక్టర్ ప్రభాకరాన్ని. అర్థరాత్రి మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నందుకు క్షమించాలి. శ్రీమతి ఆరోగ్యం బాగోలేదని ఇప్పుడే టెలిగ్రాం వచ్చింది. ఆ...అవును. వెళ్ళక తప్పదు - పైగా అది పల్లెటూరు. అక్కడ డాక్టరు సాయమైనా వుందోలేదో... యస్...నోనో ... అప్లికేషన్ మాత్రమే...ఆఁ...యస్. అవును. రేపు ఆపరేషన్ కేసొకటుంది...బెడ్ నెంబరు నైన్. ఎలాగైనా మీరు ఆపరేషన్ కేసు అటెండవ్వాలి. మళ్ళీ రేపు ఈవినింగ్ కల్లా తిరిగొచ్చేస్తాను. మిమ్మల్ని అబ్లిగేట్ చేస్తున్నందుకు...ఆఁ...నోనో... కేసు వివరాలన్నీ...అవును... థ్యాంక్యూ...వుంటాను...గుడ్ నైట్ —"

రిసీవర్ పెట్టేసి చెమట పట్టిన ముఖాన్ని తుడుచుకున్నాడు.

ఓ వైపు శారద ఆరోగ్యంపట్ల ఆదుర్దా...మరోవేపు గోపీ ఆపరేషన్ గురించీ అతని భవిష్యత్ గురించి ఆందోళన.

* * *

పంచలో పచార్లు చేస్తున్న ప్రభాకరానికి మనసులో మనసులేదు.

డాక్టరయివుండి భార్య బాధను కళ్ళారా చూచి స్వయంగా సాయపడలేకపోతున్నాడు.

ప్రక్కగదిలో ప్రసవవేదన అనుభవిస్తున్న భార్యబాధ నూహించుకుని గాభరా పడసాగేడు.

పెద్దల ఆచారాలు తనను అభ్యంతరం పెట్టినందుకు మనసులో నిందిస్తున్నాడు.

ఆస్పత్రిలో చేర్పించేందుకు అదో పల్లెటూరు.

ఏం చేయటానికీ తోచటంలేదు.

బావమరిది వాసు ఒకటి రెండుసార్లు మంత్రసాని కోసం వచ్చాడు. ఇంతలో ఇరుగుపొరుగువారు ఆడవారంతా పోగయ్యారు.

కాలుకాలిన పిల్లిలా మరదలు ఇంట్లోకీ బైటికీ తిరుగుతోంది.

అలారం టైంపీసు దగ్గరే పెట్టుకుని పంచాంగం తిరగేస్తూ తిథులు, నక్షత్రాలు చూస్తున్నారు మామగారు.

ప్రభాకరంలో ఆదుర్దా అవధులు దాటుతోంది. రిస్టువాచీకేసి చూచుకున్నాడు. సరిగ్గా గోపీకృష్ణుడా ఆపరేషన్ జరుగుతూవుండి వుంటుంది అనుకున్నాడు. ఆపరేషన్ గదిలో తను కన్పించకపోయేసరికి బెంబేలు పడిపోతాడేమో... నిరుత్సాహపడి చచ్చిపోతానేమోఅనేనిర్ణయాని కొస్తాడేమో...

క్రొత్త డాక్టర్ కేసి వెర్రిగా చూస్తాడు. తన భవిష్యత్ మీద, బ్రతుకుమీద నమ్మకం కోల్పోతాడు. దేవుడు తనకు దూర మైనాడని ఏడుస్తాడు. గోపీ తల్లి తనను శపిస్తుంది.

సిగరెట్ వెలిగించాడు.

'కేవు... కేవు...' మని కేక విన్పించింది. రజని పరు గెత్తుకుంటూవచ్చి "బావా...అబ్బాయి పుట్టేడు...అబ్బ యెంత ముద్దొస్తున్నాడో..." అనేసి రివ్వున ఇంట్లో కెళ్ళి పోయింది.

కొడుకు పుట్టినందుకు సంతోషించాలో...అక్కడ గోపీ పరిస్థితికి బాధపడాలో అర్థం కాలేదు.

* * *

చేతిలో ఆపిల్సుతో వార్డు కేసి నడిచాడు ప్రభాకరం. ఒక్కరోజు కన్పించకపోయేసరికి నిరుత్సాహ పడిపోయిన పేషెంట్లంతా తను కన్పించేసరికి వాళ్ళ సంతోషానికి హద్దు ల్లేవు.

నేరుగా గోపీ బెడ్ దగ్గర కెళ్ళాడు.

బెడ్ మీద గోపీ లేకపోవటం చూచి నిర్ఘాంతపోయాడు ప్రభాకరం.

"సారీ ప్రభాకరం!...మోస్టు అన్ లక్కీ!!...గోపీ... మానసిక దౌర్బల్యానికి గోపీ ప్రాణాలు తీసింది" అనేసి భుజంతట్టి వెళ్ళిపోయాడు డాక్టర్ సుదర్శనం.

'గో...పీ...' పెద్దపెట్టున అరిచాడు ప్రభాకరం.

ప్రభాకరం అరుపు గది నాలుగు మూలలకూ అల్లుకుని ప్రతిధ్వనించింది.

అంతవరకూ బెడ్ మీద పడుకుని నిద్రపోతున్న ప్రభాకరం త్రుళ్ళిపడి లేచాడు.

'ఏమిటీ పీడకల...గోపీ చనిపోవటమేమిటి?...తనకు అబ్బాయి పుట్టటమేమిటి?...ఛ ఛ...' అనుకున్నాడు.

ప్రక్కనే కూజాలో వున్న మంచినీళ్ళు గ్లాసులోనికి వంచుకుని గటగటా త్రాగేడు.

గోపీపట్ల తనకుండే శ్రద్ధ, అనురాగం, నిద్రలోకూడా గుర్తువస్తూ పలవరించటం డాక్టరై వుండికూడా, తన బలహీనతకు నవ్వుకుని, మళ్ళీ బెడ్ మీద పడుకుని నిద్రలోకి జారబడ్డాడు ప్రభాకరం.